
బెంగళూరులోని శివమహావిగ్రహం

లేదు. భక్తజనకోటిని అర్థం చేసుకోవాల్సిందే. అయితే ఆ రోజునయినా భక్తితత్పరతతో వుండకపోతే ఎలా అన్నదే అసలు ప్రశ్న.

మహాశివరాత్రిని కేవలం సెలవురోజుగా చూసేవారికి భక్తి ఏముంటుంది, చిత్తశుద్ధి లేని వారి పూజలకి ఫలం ఏముంటుంది? ఈ విషయమై ఆలోచించాలి. ఉపవాసాలు చేయడంలోనూ ఒక పద్ధతి వుండాలి. అన్నం తప్ప చిరుతిళ్ళు లాగించేస్తామంటే ఆ ఉపవాసానికి అర్థం లేదు. ఆకలి అన్న ధ్యాస ఎరగకుండా శివనామస్మరణలో గడపాలి. కనీసం ఆ ఒక్కరోజు మౌనంగా శివుని ధ్యానించాలి. లేదా కనీసం ఆరు గంటలపాటు మౌనంగా ఏకాంతంలో గడపాలి. అప్పుడే శివుని మీద మనసుని లగ్నం చేసే వీలుంటుంది. ఇదే గొప్ప పూజ అవుతుంది. మహనీయమైన ధ్యానం అవుతుంది.

## టీవీకి దూరం

జాగరణ చేసే రోజున అసలు టీవీ జోలికి వెళ్ళకూడదు. శివుడి మీద సినిమాలు చూపించినా చూడక్కర్లేదు. నిజానికి శివుని మీద మనసుని లగ్నం చేస్తే మన మనో మందిరంలోనే శివుడు వుంటాడు. ఇక శివుడి కోసం టీవీ డబ్బా చూడాల్సిన అవసరం ఏముంది! అందుకని జాగ రణ చేసే సమయాన శివుని ధ్యానించాలి. శివుని నామస్మరణలోనే పరమార్థం వుందని గ్రహించాలి. ఇంట్లో టీవీ పెట్టకుండా వుండాలి.

మహాశివరాత్రినాడు ఆలయాలకి వెళ్ళి శివలింగాన్ని దర్శించుకోడంతోనే మోక్షప్రాప్తి లభిస్తుందని, పాపాలు హరించుకుపోతాయనే భ్రమలకు లోను కాకూడదు. మొక్కుబడితో అరగంట వెళ్ళిరాగానే సరిపోదు. దైవాన్ని నిజంగా ధ్యానించాలి. మానవీయంగా వ్యవహరించాలి. పూజాదికాల్ని మనస్ఫూర్తిగా నిర్వహించాలి. అప్పుడే పుణ్యఫలం, జాగరణఫలం లభిస్తాయి.

## భక్తజన సందోహం

మహాశివరాత్రి కోసం దేశంలోనూ, రాష్ట్రంలోనూ వున్న ఆలయాల్ని ప్రత్యేకంగా అలంకరిస్తారు. వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. మన రాష్ట్రంలో ప్రధాన శైవక్షేత్రాలయిన శ్రీశైలం, శ్రీకాళహస్తిలకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. వారి భావోద్వేగాల్ని గమనిస్తే మన జనాల్లో భక్తిరసం తీవ్రత ఎంతో బోధపడుతుంది. మరి ఈ భక్తులు ఎంత మానవీయంగా ప్రవర్తిస్తారనే సందేహం వస్తుంది. బతుక్కీ, భక్తికీ సంబంధం లేకుండా గడిపేసే సామాన్యులు ఆ ఒక్కరోజు మాత్రం గంటల తరబడి క్యూలో నిల్చోవటం, కొన్ని క్షణాల దర్శనం కోసం పడిగాపులు పడటంలో ఒక వైచిత్రి వుంది. దర్శనం కోసం కనబరిచే సహనం దైనందిన జీవితంలో కానరాకపోడం చిత్రంగా తోస్తోంది. భక్తికీ, బతుక్కీ మధ్యన లంకె తెగిపోవడమే దీనికి మూలం. సంప్రదాయంలో వున్న బలం లోకాన్ని నడిపిస్తోంది. చర్విత చరణంగా అనిపించినప్పటికీ కాలంతోపాటు కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు, భక్తితో కూడిన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పండగల ప్రాశస్త్యాన్ని నిలుపుతున్నాయి. భగవంతుని ధ్యానానికి మనుషుల్ని పురిగొల్పుతున్నాయి. మనకు భక్తిశ్రద్ధలతో కూడిన పండగల్లో ముఖ్యమైంది మహాశివరాత్రి. అందుకే శివరాత్రినాడు శివుని ధ్యానం పాపహరణం, ఆ రాత్రి జాగారం ఎంతో పుణ్యఫలం! ●

## ద్వాదశ జ్యోతిర్లింగాలు

*1. సోమనాథేశ్వరుడు- గుజరాత్‌లోని సోమనాథ్‌లో వుంది.*

*2. శ్రీ మల్లికార్జునుడు - ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా శ్రీశైలంలోవుంది.*

*3. మహాకాళేశ్వరుడు- మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో వుంది.*

*4. ఓంకారేశ్వరుడు - మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు **80** కిలోమీటర్ల దూరంలో వుంది.*

*5. కేదారేశ్వరుడు - ఉత్తరప్రదేశ్‌లోని హిమాలయ పర్వత పంక్తిలో భాగమైన కేదార పర్వతంపై కేదారేశ్వరుడు నెలవై వున్నాడు.*

*6. భీమశంకరుడు - మహారాష్ట్రలోని పూనాకు **75** మైళ్ళ దూరంలో సహ్యాద్రి పర్వత పంక్తుల్లో వెలసిన దివ్య క్షేత్రమిది*

*7.విశ్వేశ్వరుడు - ఉత్తరప్రదేశ్‌లోని కాశీ క్షేత్ర జ్యోతిర్లింగం.*

*8. త్ర్యంబకేశ్వరుడు - మహారాష్ట్ర నాసిక్ జిల్లాలోని త్ర్యంబకేశ్వరం పవిత్ర గోదావరి నది జన్మస్థలి.*

*9. వైద్యనాథేశ్వరుడు- మహారాష్ట్రలోని భిర్‌జిల్లా పర్లీలో వెలిసిన జ్యోతిర్లింగం*

*10. నాగేశ్వరుడు - గుజరాత్‌లోని ద్వారకకి **14** కి.మీ. దూరంలో ఉంది.*

*11. రామేశ్వరుడు - తమిళనాడులోని రామేశ్వరంలో వెలిసిన జ్యోతిర్లింగం.*

*12. ఘృశ్శేశ్వరుడు - మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కి దగ్గర్లోని దౌలతాబాద్‌కి **20** కి.మీ దూరంలో వుంది.*







# మహనీయుల మాటల్లో హాస్యం

కట్టమంచి రామలింగారెడ్డిగారు ఎప్పుడు, ఎక్కడ ప్రసంగించినా- ఆయన నిర్వచనాలు సామాన్య వ్యక్తులనే కాక మేధావులను సైతం ఆలోచింపజేస్తాయి.

కట్టమంచి వారు బ్రహ్మచారిగా వుండి, సర్వ స్వతంత్రులుగా జీవించారు.

"మీరు స్త్రీ-పురుషుల మధ్య వైవాహిక సంబంధాన్ని గురించి ఏం చెబుతారు?" అని ఒక పత్రికా విలేకరి అడిగితే- "పురుషులు వివాహం చేసుకుని 'బ్లండర్స్'(ఘోరమైన తప్పు చేస్తే) స్త్రీలు 'ప్లండర్స్'(దోపిడీ) చేయటానికి జన్మించారు!" అన్నారు.


కట్టమంచి

ప్రకాశం పంతులుగారి స్థాయి ప్రతిభావంతుడు ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలలో దిగి, తలమునకలై 'స్వతంత్ర' పత్రికపెట్టి తెలుగు వారికే పరిమితమవటం కట్టమంచి వారికి నచ్చేది కాదు. అందుకే ఒకసారి ఆయన ప్రకాశం గారిని కలిసినప్పుడు "మీరు దేశ స్థాయి నాయకులై కేంద్రంలో వుండాల్సిన వారు! 'ఆంధ్రకేసరి' 'ఆంధ్రకే-సరి' అయితే ఎలా?" అంటూ, విమర్శించారు.

1921లో, రామలింగారెడ్డిగారిని గాంధీజీ కలిసి మాట్లాడి- "వచ్చే సంవత్సరం సెప్టెంబర్ ఒకటవ తేదీకి మన దేశానికి స్వాతంత్ర్యం వస్తుంది!" అన్నారు.

వెంటనే కట్టమంచి వారు "మీరు మహాత్ములు కదా! పొరబడి వుంటారు. మీరు అనదలచుకున్నది బహుశా ఏప్రిల్ ఒకటి (ఆల్ ఫూల్స్‌డే) అయివుంటుంది" అన్నారు.

ఒకసారి ఒక రిపోర్టరు "జస్టిస్ పార్టీ భవిష్యత్తు ఏమిటి సార్?" అని అడిగితే-

"జస్టిస్ పార్టీకి భవిష్యత్తు ఏమి వుంటుంది? వాళ్ళకు జాతీయగీతాలు రావు! ఇక వాళ్ళకు మిగిలింది హంసగీతం" (చావు గీతం) అన్నారు.

****

జంధ్యాల గొప్ప హాస్య రచయిత, అంతకు మించిన గొప్ప కామెడీ చిత్రాల డైరెక్టర్.

ఆయన 'బాపు-రమణల' అభిమాని.

బాపుగారు 'సాక్షి' మొదటిచిత్రంతో కొత్త చరిత్ర సృష్టించారు. అది హిట్. అది ఫుల్ లెంగ్త్ ఔట్ డోర్ హిట్ చిత్రం. అయితే రెండవ చిత్రం 'బంగారు పిచిక' మాత్రం 'క్లాసిక్ ఫ్లాప్ చిత్రం' అయింది. దీనికి కారణం 'బంగారు పిచిక' వచ్చినప్పుడు ఫుల్ లెంగ్త్ కామెడీలు జనాల్లో ఇంకా ఎక్కలేదు. అందుకని అది "టూ ఎర్లీ!" ఆ చిత్రంలో, విజయనిర్మల హీరోయిన్. ఇరవై ఏళ్ళ తరువాత 'బంగారు పిచిక' కథనే కొన్ని మార్పు చేర్పులతో విజయనిర్మలగారి అబ్బాయి నరేష్ హీరోగా 'పెళ్ళికొడుకు' అనే చిత్రం తీశారు. అది కామెడీ చిత్రం. అయితే అప్పటికి చాలా కామెడీ చిత్రాలు రావటం వలన ఈ పెళ్ళికొడుకు 'టూ లేట్' కావడంతో బాగా ఆడలేదు.

అందుకే- "ఒకటి టూ ఎర్లీ" ఒకటి "టూ లేట్" అని కామెంట్ చేశారు జంధ్యాల.

****


బాపు

ఒక్కోసారి ఒక్కో ఆప్తమిత్రుడి ప్రవర్తన వింతగా వుండి, ఒక పక్క కోపం, మరో పక్క నవ్వూ తెప్పిస్తాయి.

బాపుగారి అన్నగారు భాను కీర్తిశేషులయ్యారు. బాపు, రమణ, తక్కిన ఆత్మీయులు హాస్పిటల్ దగ్గర వేచి వుండగా, ఎల్.ఐ.సీ. ఆఫీసర్ సుబ్బారావు అనే మిత్రుడొచ్చి బాపుగారిని "హమ్మయ్య! నువ్వు కాదన్నమాట! ఇందాక రమణ ఫోనులో బాపు తాలూకు బ్యాడ్‌న్యూస్ అంటే- నువ్వు పోయావనుకున్నాను" అన్నారు, బాపును ఆశ్చర్యంగా చూస్తూ.

"పోయింది నేను కాదు, మా బ్రదర్ భాను!" అన్నారు బాపు.

"హదే! రమణ ఫోను చేస్తే- నువ్వే అనుకున్నాను! నువ్వు కాదన్నమాట" అన్నాడు సుబ్బారావు. అంత బాధలోనూ నవ్వు వచ్చింది బాపు-రమణలకు.

****

బాపు-రమణల చిత్రాల్లో అల్లురామలింగయ్యకు తప్పక వేషం వుండేది. 'ఆమ్యామ్యా' అంటూ అల్లురామలింగయ్య సృష్టించిన 'లంచం' అనే 'పదం' జనాల్లోకి వెళ్ళి కొత్త అర్థాన్ని సృష్టించింది.

"తీ.తా."

"తీసేసిన తాసిల్దార్" అంటూ రాజబాబు అల్లురామలింగయ్య మధ్య కామెడీ హిట్ అయి, అది చిత్ర విజయానికి దోహదం చేసింది. అలా రామలింగయ్యగారికి, 'బాపు-రమణ'ల చిత్రాలంటే ప్రాణం. 'సంపూర్ణ రామాయణం' తీస్తున్నట్లు తెలిసి-

"రామాయణం లాంటి పురాణంలో నా బోటివాడికి వేషం ఉండదేమో?" అన్నారు అల్లు.

"పెద్ద వేషమే వుంది! కాని కొలతల్లో తేడా వస్తుందని ఆలోచిస్తున్నా" అన్నారు బాపు.

"కొలతలు తేడా వుంటే సర్దుకుందాం! ఇంతకీ అది ఏ పాత్ర సార్?"

"శ్రీరాముడు" అన్నారు, బాపు.

అంటే- త్రిల్లయిపోయిన అల్లు ఆంజనేయుడై, డ్యాన్సు ఆడేశారు.

****


సావిత్రి

పద్మనాభం నిర్మించిన 'దేవత' చిత్రం గొప్ప హిట్. అందులో రామారావు- సావిత్రి ముఖ్యమైన జంట. పద్మనాభం, సావిత్రిని హీరోయిన్‌గా బుక్ చేసి, ఆమెకు అడ్వాన్సుగా పారితోషికం ఇస్తుండగా, ఒక నోటు జారి కింద పడింది.

సావిత్రి ఆ నోటు అందుకుని కళ్ళకద్దుకొని "ఇది చాలా మంచి శకునం! 'మీ 'దేవత' వంద రోజుల హిట్ చిత్రం అవుతుంది. ఇది నిజం!" అంది.

"డబ్బు ఇలా కిందపడితే నా చిత్రం 'ఫట్' అవుతుందని భయంగా వుంది" అన్నారు పద్మనాభం. ఆమె చెప్పినట్టే అది 'పెద్ద హిట్' అయ్యింది.

**- ఎం.డి.సౌజన్య**